క్లుప్తంగా

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకన్న



విద్యార్థులతో కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుల్లో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి నడవడికలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఆరోగ్య శిబిరం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న బాలికల గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడిక్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న 302 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి, అవసమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా, శ్వేత, స్టాఫ్‌నర్స్ దీపిక పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఇటీవల ఐఎస్‌టీఎస్ పరీక్షలను నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాల యాజమాన్యం పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో రాణించి మంచి ఫలితాలు సాధించిన 8వ తరగతి విద్యార్థులు ఆశ్రిత, రాముకు ల్యాప్ టాప్‌తో పాటుగా బంగారు పతకాలు, ఏడో తరగతి విద్యార్థి తిపిర్నేని గాత్రేయికి స్మార్టు వాచ్‌తో పాటుగా బంగారు పతకాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీయం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్, తిరుమల్‌రెడ్డి, వీరేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి సిద్ధం



ముస్తాబైన సీతారాంపూర్ దేవాలయం



కల్యాణ మండపం

- సుందరంగా ఆలయాలు ముస్తాబు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

షాబాద్: శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్యాణ మహోత్సవాలకు మండలంలోని అన్ని ఆలయాలు ముస్తాబయ్యాయి. కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు మంగళవారం తగు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారామ కల్యాణోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని సీతారాంపూర్, తాళ్ళపల్లి, ఆస్పల్లిగూడ, సర్దార్‌నగర్, షాబాద్, మన్‌మర్రి, నాగర్‌గూడ గ్రామాల్లోని ఆలయాలను వివిధ రంగులు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆయా సీతారాముల దేవాలయాల్లో ఉదయం 11 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. భజన కార్యక్రమాలతో శ్రీరామనవమి ఉత్సవాలు పూర్తవుతాయన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్



అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మికతతో మానవుడి మనుగడకు మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితతిరుపతయ్యలు అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో రెండురోజులుగా బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండోరోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. అనంతరం టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉత్సవాలను కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందరూ కలిసి ఉత్సవాలు జరుపుకున్నప్పుడే ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. రాష్ట్రంలో సీఎరేవంత్‌రెడ్డి దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ రవి, శ్రీకాంత్, మల్లేశ్, బాల్‌రాజ్, భీమయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మానయ్య, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



ఆలయంలో పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

షాబాద్: కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామం నుంచి దేవాలయం వరకు కలిపే రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, నాయకులు సుభాష్, చెన్నయ్య, నర్సింలు, రవీందర్, వెంటకయ్య, మల్లేశ్, యాదయ్య, రాంచందర్, సత్తయ్య, అక్తర్ పాషా తదితరులున్నారు.

లోఓల్టేజీ సమస్య తీరేదెప్పుడో?



జీవన్‌గూడలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

- జీవన్‌గూడలో 75కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన జీవన్‌గూడ గ్రామంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యను తక్షణం పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. జీవన్‌గూడ గ్రామానికి 75 కేవీ గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గతంలో ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు 25 కేవీ గల మూడు విద్యుత్ బుడ్డీలు ఒకే దిమ్మెపై అమర్చారు. దీని నుంచే గ్రామానికి గతం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. రోజురోజుకు ఈ గ్రామంలో జనాభా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం జీవన్‌గూడలో 120 ఇళ్లు 150 కుటుంబాలు, దాదాపు 200లకుపైగా జనజీవనం సాగుతోంది. గతంలో అమర్చింది చిన్న ట్రాన్స్‌ఫార్మర్ కావడంతో విద్యుత్ సమస్య అనేకంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో మరింత అధికమైందని అంటున్నారు. వేసవిలో ఎండలకు విద్యుత్ సక్రమంగా రాకపోవడం, అప్పుడప్పుడూ ట్రిప్ అయి కరెంటు నిలిచిపోతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని నెలరోజుల ముందే ఉన్నతాధికారులకు తెలియజేశామని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. అప్పట్లో ఫిర్యాదు మేరకు అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిశీలించారని కానీ ఎలాంటి పనులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. జీవన్‌గూడలో పెరిగిన జనాభాకు అనుగుణంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఓల్టేజీతో ఫ్యాన్‌లు, విద్యుత్ దీపాలు, టీవీలు, బోరు మోటార్లు కాలిపోతున్నాయని, అధికారులు ఇకనైనా స్పందించి 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. మండల విద్యుత్ ఏఈ రాజేశ్‌ను వివరణ కోరగా.. జీవన్‌గూడలో లోఓల్టేజీ సమస్య ఉందని రెండురోజుల క్రితమే తమ దృష్టికి వచ్చిందని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



మాజీ సర్పంచ్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామరగిద్ద, ఊరెళ్ల గ్రామాల మాజీ సర్పంచ్‌లు వెంకటేశం గుప్తా, జాహంగీర్, సింగప్పగూడ సీనియర్ నాయకుడు అలీ మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న నాయకుడు



చటారి దశరథ్‌ను ఆశీర్వదిస్తున్న కేసీఆర్

చేవెళ్ల: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి, ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. చేవెళ్ల మండలానికి చెందిన దశరథ్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయన కేసీఆర్‌ను కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనకు కండువా కప్పి ఆశీర్వదించారు.

బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

షాద్‌నగర్: బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారిందని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. తద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. రాష్ట్ర పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని విమర్శించారు. మండలాల్లో ఎంఈఓలు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు, డైట్ లెక్చరర్లు లేకపోవడంతో విద్యావ్యవస్థ అంతా కుంటుపడిందన్నారు. ఫలితంగా విద్యార్థులు ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగులకు మంచి పీఆర్సీ రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

మాట్లాడుతున్న భీంభరత్

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలించాలన్నారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్ బాగుంటుందని, పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని గుర్తు చేశారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ఆరు హామీలను ప్రజలకు వివరించాలన్నారు. టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడానికి సీఎం రేందర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో ఎంపీటీసీ చెన్నయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు అశ్విని, నాయకులు చెన్నయ్య, నర్సింలు, రవీందర్, అక్తర్‌పాషా, యాదయ్య, వెంకటయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేక..



కేసారంలో ఎండిన పంటను చూపిస్తున్న రైతు రాంచంద్రయ్య



షాబాద్‌లో ఎండిపోయిన వరి పంట

షాబాద్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లు ఆగి పోస్తుండం, మరోవైపు ఎండలు కూడా ముదరడంతో సరిపడా నీరందక పొలాలు వరిచేను పూర్తిగా ఎండిపోయింది. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన రాంచంద్రయ్య రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఒక ఎకరం పంట ఎండిపోయింది. అదే విధంగా షాబాద్ గ్రామానికి చెందిన చిన్నయ్య మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఒక ఎకరా నీరు అందక పంట ఎండిపోయిందని రైతులు వాపోయారు. పంట పొలాలు నీరందర పూర్తి ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య రానివొద్దు



మాట్లాడుతున్న అధికారులు

శంకర్‌పల్లి మండల సమావేశంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

మొయినాబాద్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శంకర్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా విద్యుత్, మంచినీరు, ఆరోగ్య సమస్యలపై సభ్యులు చర్చించారు. వేసవి మొదలు కాగానే గ్రామాల్లో కరెంటు కోతలు, మంచినీటి సమస్య తీవ్రమైందని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో కరెంటు కోతలు ఎక్కువయ్యాయని, కరెంటు ఎప్పుడు పోతుందో.. వస్తుందో అర్థం కావడంలేదని పలువురు సభ్యులు మాట్లాడారు. అదేవిధంగా మంచినీటి సమస్య కూడా తలెత్తుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో ఎక్కడ మంచినీటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పనిచేసే ఉపాధి కూలీలకు షెడ్‌లు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకయ్య, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి



కేశంపేట: మాట్లాడుతున్న రాజారత్నం



కొందుర్గు: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మల్లారెడ్డి

గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక అధికారులు, వాటర్‌మెన్‌లతో సమావేశం

కేశంపేట: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, వాటర్‌మెన్‌లతో నీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి సమస్యలు ఉంటే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న బోరుమోటార్లను రిపేర్ చేసి అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింలు, మిషన్ భగీరథ ఏఈ నాగమణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్య తలెత్తకుండా చర్యలు: డీఎల్‌పీఓ

కొందుర్గు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ ప్రత్యేకాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ మల్లారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నీటికోసం ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శివలాల్ గ్రామ ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ సమస్య వచ్చినా సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీఓ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.